వేకువ
# సమయం

సంపుటి: 14 సంచిక: 135

VEKUVA SAMAYAM TELUGU DAILY

★ Mahabubnagar ★ Hyderabad ★ Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: శనివారం 06 జూన్ 2026







2వ పేజీలో...




2వ పేజీలో...

## పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేసి
# 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం





**సమయం ప్రతినిధి, జడ్చర్ల :** పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేసి 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జడ్చర్లలో నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పాలమూరు బిడ్డగా గత రెండు రోజులుగా జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పరిశీలిస్తున్నానని పేర్కొన్న ముఖ్యమంత్రి, వలసల కష్టాలు, రైతుల ఆత్మహత్యల బాధలు తనకు తెలుసన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో పాలమూరు ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని ఆశించినప్పటికీ, గత పదేళ్లలో జిల్లాలో ఒక్క ప్రధాన ప్రాజెక్టు కూడా పూర్తికాలేదని విమర్శించారు. పాలమూరు ప్రజలు రాజకీయంగా ఆదరించినప్పటికీ గత ప్రభుత్వం జిల్లాకు న్యాయం చేయలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసినా, ఉద్దండపూర్ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించలేదని ఆరోపించారు. జిల్లాలోని ప్రాజెక్టుల కోసం గత 30 నెలల్లో రూ.8 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ కొడంగల్‌లో ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నామని, పిల్లలు ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చదువే జీవితాలను మార్చగలదని, తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 15 లక్షల రేషన్ కార్డులు జారీ చేసిందని, 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తోందని తెలిపారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి రూ.10 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీల నీటి కేటాయింపును సాధించడం, జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు మంజూరు చేయడం తమ బాధ్యత అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు కొనసాగుతుందని, రానున్న ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి** మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ జల హక్కులు తీవ్ర ప్రమాదంలో పడ్డాయని లేఖలో ఆరోపించారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. దీంతో పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చోటుచేసుకుందని తెలిపారు.

**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** తెలంగాణ జల హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆరోపించారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ 74 శాతం వినియోగిస్తుంటే.. తెలంగాణ 25 శాతానికి పరిమితమైందని లేఖలో తెలిపారు. రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రమాదంలో పడేసిందని మాజీ మంత్రి విమర్శించారు. సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలు సాగునీటి రంగానికి ముప్పుగా మారాయని లేఖలో స్పష్టం చేశారు. అందుకే రైతు డిస్కం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించాలని అన్నారు. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకుండా జల హక్కులను సమర్థంగా కాపాడాలని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.









# సంపాదకీయం

## ముసురుకుంటున్న ఆర్థిక సంక్షోభం

భారత ప్రధాని నరేంద్ర మోదీ బంగారం తక్కువ కొనమనీ, పెట్రోలూ, వంట నూనెల వాడకం తగ్గించమనీ చెబుతూ పరోక్షంగానే భారతదేశం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని ప్రస్తావించారు. దరిమిలా డాలరుకు రూపాయి విలువ రూ.96కు చేరడం; పెట్రోల్‌పై అదనంగా రూ.6.50, వంట గ్యాస్ సిలిండర్ రూ.60, కమర్షియల్ సిలిండర్ రూ.993 పెరగడం, మరోవైపు స్టాక్ మార్కెట్ 5శాతం పడిపోవడం... వంటివి జరిగాయి. ఇరాన్‌పై యుద్ధం తరవాత మొదలైన ప్రపంచ సంక్షోభం ఇంటి గడప దాకా వచ్చిందన్న విషయం ప్రజలకు కూడా మెల్లగా అర్థం అవుతోంది. రూపాయి విలువ అంతర్జాతీయంగా ఎంత ఉండాలి అన్న విషయంలో ఒక స్థిరమైన సిద్ధాంతమేమీ లేదు. మార్కెట్ నిర్ణయించిన ధర కరెక్ట్ అంటారు కొందరు. మార్కెట్ ధర అన్నది దీర్ఘకాలిక ఆర్థిక అవసరాలను దెబ్బతీస్తుంది అనేవాళ్ళూ ఉన్నారు. మార్కెట్‌లో ఆ ధరను కూడా ఎలా నిర్ణయిస్తారో చూస్తే ఆశ్చర్యమేస్తుంది. భారతదేశానికి విదేశీ మారకం మన ఎగుమతుల వల్లనూ, ప్రవాస భారతీయులు ఇంటికి పంపించిన డాలర్ల వల్లనూ, విదేశీ మదుపర్లు తెచ్చిన పెట్టుబడుల వల్లనూ, మన కంపెనీలు విదేశీ సంస్థల నుంచి అప్పుగా తెచ్చిన డాలర్ల వల్లనూ వస్తుంది. మరోవైపు, మనం కట్టాల్సిన దిగుమతుల బిల్లులు, విదేశీ పెట్టుబడిదారులు తిరిగి తీసుకువెళ్లే లాభాలు, ఇతర చెల్లింపుల కోసం డాలర్లకు డిమాండ్ ఏర్పడుతుంది. ఈ డిమాండ్, సరఫరా మధ్య సమతుల్యత ఆధారంగానే ఆ రోజు రూపాయి ధర నిర్ధారణ అవుతుంది. ఈ ధరను ఆర్బీఐ ప్రభావితం చేయగలదు. ఉదాహరణకు, ఈనాటికి ఆర్బీఐ వద్ద 700 బిలియన్ డాలర్ల నిల్వలు ఉన్నాయని సమాచారం. అందులో 250 డాలర్లు ఐఎమ్‌ఎఫ్ తాలూకు డిపాజిట్స్, వగైరాలు తీసేస్తే 400 బిలియన్ డాలర్లలో కొంతవరకు రూపాయిని స్థిరీకరించడానికి వాడుకోవచ్చు. నెలకు ఒక 30 బిలియన్ డాలర్ల చొప్పున రెండు మూడు నెలలు అమ్మి, రూపాయిని కాపాడే ఆస్కారం ఉందన్నది కొంతమంది నిపుణుల వాదన. కానీ ఇది స్వల్పకాలిక పరిష్కారమే. మరోపక్క ఆర్థికవేత్తలైన గీతా గోపీనాథ్, పానాగరియా, అరవింద్ సుబ్రమణియం, డి.సుబ్బారావు లాంటి వారు రూపాయి విలువను అంత కిందికి పడనివ్వబోమని చెబుతున్నారు. రేపు డాలరు– రూపాయి విలువ వందో, నూట ఇరవయ్యో అయితే పారిశ్రామిక రంగం కుదేలవుతుందన్న విషయం గురించి, ప్రజల మీద పడే భారం గురించి వీరు గమనిస్తున్నారో లేదో తెలీదు. రూపాయి మారకం విలువను ఇప్పుడు రక్షించలేం. రూపాయి స్థిరంగా ఉండే పరిస్థితులు క్షీణించాయి. ఇది కేవలం ఇరాన్ యుద్ధం వల్ల వచ్చింది కాదు, గత పన్నెండేళ్లుగా ప్రభుత్వం ఆర్థిక రంగంలోని బలహీనతలను నిర్లక్ష్యం చేస్తూ వచ్చిన ఫలితం! ఎందుకంటే ఆసియా ఖండంలోనే ప్రస్తుతం మన దేశం అత్యంత బలహీనమైన పరిస్థితిలో ఉంది. ఎలాగంటే-- మొదటిది, ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉన్నాయి. దిగుమతుల్లో ముఖ్యమైనవి ఎలక్ట్రానిక్స్, బంగారం, ఆయిల్ దిగుమతులు. ఎలక్ట్రానిక్స్‌ను అంత పెద్ద ఎత్తున దిగుమతి చేసుకోవడానికి కారణం అతి సులభమైన సెమీకండక్టర్లను కూడా మనం తయారు చేసుకోకపోవడం. కార్లు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు, బైకులు, టీవీలు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, డిఫెన్స్ ఉత్పత్తులు ఏమి తయారు చేసినా అందులో ఎలక్ట్రానిక్ విడి భాగాలు చైనా నుంచి దిగుమతి కావాల్సిందే. దీన్ని నివారించాలంటే ప్రభుత్వం ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని కొనుక్కుని ఇక్కడ ఆ పరిశ్రమలు పెట్టించి చేయిపట్టుకుని నడిపించాలి. అది చేయడానికి దానికి మన నాయకులకు తీరిక లేదు. పొద్దున లేస్తే... ఏ రాష్ట్రంలో ఎన్నికలు, ఎలా గెలవాలి అనే ఆలోచిస్తోంది ప్రభుత్వం. విదేశీ పెట్టుబడి ఏమైనా ఎగుమతులను పెంచుతుందా అంటే, వాళ్లు మన దేశంలో ఉన్న గిరాకీ వాడుకుందామని చూసేవాళ్లే. ఇక బంగారం కొనుగోలు తగ్గించుకోవడం విషయానికి వస్తే- అక్షయ తృతీయ అని ఊదరగొట్టి ప్రతి పండగకూ బంగారం కొనుక్కోమని 30ఏళ్లుగా చెప్పి, ఇప్పుడు కొనుక్కోవద్దని చెబితే ఎవడు వింటాడు? ఇదిగాక, ద్రవ్యోల్బణం నుంచి ఆస్తి విలువను కాపాడుకోడానికి బంగారం ఒక పెద్ద మార్గం అయిపోయి కూర్చుంది. ప్రధానమంత్రే కాదు కదా, ఎవరు చెప్పినా ప్రజలు వినరు. బంగారం ఖరీదు పెరిగితేనే దాని కొనుగోలు తగ్గుతుంది. అప్పుడు బంగారం సామాన్య ప్రజలకు అందుబాటులో లేకపోతే వారికి వచ్చే కోపం మీద ప్రభుత్వాలకు భయం ఉంది. అలాగే పెట్రోల్, డీజిల్, గ్యాస్, సేంద్రియ ఎరువుల వాడకం తగ్గించుకోవాలంటే–ఎవరు తగ్గించుకోవాలి? రేపు ఆహారధాన్యాల ఉత్పత్తి పడిపోతే ఆ ధరల మంట మొదలవుతుంది. వీటన్నిటికీ మందు రూపాయి మార్కెట్ విలువ పడిపోనివ్వడమే అంటున్నారు కొందరు. దాని ప్రభావం వల్ల దిగుమతులు మరింత ప్రియమై ఉత్పత్తి/ వాడకం తగ్గి రూపాయి పడిపోవటం ఆగుతుంది అని ఒక చిన్న ఆశ. ఫలితంగా ఎకానమీ మందగించి గ్రోత్ రేట్ ఏ ఐదు శాతానికో పడిపోయినా తప్పదు. సామాన్యుల మీద పేదరికం, నిరుద్యోగ ప్రభావం ఎక్కువగా పడుతుంది. అంటే వికసిత భారత్ కూడా ఇప్పుడప్పుడే జరగదు. నిజానికి భారత ఆర్థిక రంగంలో ఈ డోలాయమాన స్థితి ఈ ప్రభుత్వం రాక ముందు నుంచీ ఉంది. ద్రవ్య సంక్షోభం, బ్యాంకుల మొండి బకాయిలు, డీమానిటైజేషన్, కోవిడ్ లాంటి సంక్షోభాలన్నీ గత పదిహేనేళ్లుగా వస్తున్నాయి. మొదటి నుంచీ ఐటీ రంగం, పెట్రోకెమికల్స్, ఇంజనీరింగ్ వంటి కొద్ది రంగాల్లో పెరిగిన ఎగుమతుల ఆధారంగా, కరెంట్ అకౌంట్ డెఫిసిట్‌ను 2శాతం లోపే ఉంచుతూ, మిగిలిన అవసరాలకు అప్పులు తెచ్చుకుని దిగుమతులు చేసుకుందామనే వ్యూహంలోనే ఎంతో రిస్కు ఉంది. నిజానికి ఆర్థిక వ్యవస్థ పక్కాగా ఉందనీ, ధరలు అదుపులో ఉన్నాయనీ, ద్రవ్య లోటు కూడా అదుపులో ఉందనీ, కొంతమంది ఆర్థికవేత్తలు చెబుతున్నారు. కానీ ఈ సూచికలు ఒక మంచి పెరుగుదలను సూచించడానికి సరిపోవు. దేశంలో మధ్యతరగతి సేవింగ్స్ 37 నుంచి 27శాతం దిగువకు పడిపోతున్నాయి. ఎప్పుడూ లేని విధంగా వినియోగ వస్తువుల మీద ఖర్చు 5శాతం మేరకు పడిపోయింది. అసంఘటిత రంగం కుదేలైపోయి ఉంది.

## హైటెక్స్‌లో ఘనంగా ప్రారంభమైన ‘థ్రెడ్ పోచంపల్లి’




**సమయం ప్రతినిధి, హైదరాబాద్ :** తెలంగాణకు అంతర్జాతీయ ఖ్యాతి తీసుకొచ్చిన పోచంపల్లి ఇకత్ కళా వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న “థ్రెడ్ పోచంపల్లి” ప్రదర్శన శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఘనంగా ప్రారంభమైంది. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు & భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రదర్శనను ప్రారంభించారు. తెలంగాణ జానపద కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రారంభమైన కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, చేనేత కళాకారులు, పరిశ్రమ ప్రతినిధులు, చేనేత ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన ప్రవేశ మండపంలో సంప్రదాయ మగ్గాల ప్రదర్శన, పద్మశ్రీ పురస్కార గ్రహీతలు రూపొందించిన హస్తకళాఖండాలు, సహజ రంగులు, వాటి తయారీకి ఉపయోగించే పదార్థాల ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఆధునిక ఏఐ ఎక్స్‌పీరియన్స్ బూత్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సందర్శకులు వర్చువల్‌గా పోచంపల్లి ఇకత్ దుస్తులను ధరించి అనుభూతి పొందే అవకాశం కల్పించారు. ఇకత్ తయారీ ప్రక్రియను దశలవారీగా వివరిస్తూ ప్రత్యేక విజువల్ గ్యాలరీని కూడా ఏర్పాటు చేశారు. 100కు పైగా స్టాళ్లలో సంప్రదాయ చీరలు, ఆధునిక ఫ్యాషన్ దుస్తులు, పురుషుల వస్త్రాలు, గృహాలంకరణ ఉత్పత్తులు, జీవనశైలి వస్తువులు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. పోచంపల్లి నేయకళ ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఎలా విస్తరిస్తోందో ఈ ప్రదర్శన ప్రతిబింబిస్తోంది. తెలంగాణ పర్యాటక శాఖ కూడా కార్యక్రమంలో భాగస్వామ్యమై పోచంపల్లి గ్రామ సందర్శనకు ప్రత్యేక పర్యాటక ప్యాకేజీలను ప్రచారం చేస్తోంది. దీని ద్వారా సందర్శకులు నేరుగా నేత కుటుంబాలను కలుసుకుని సంప్రదాయ మగ్గాల పనితీరును వీక్షించే అవకాశం పొందనున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్, సికింద్రాబాద్, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రదర్శనను సందర్శించి అసలైన చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వేలాది నేత కుటుంబాలకు మద్దతు అందించాలని కోరారు. పోచంపల్లి ప్రాంతీయ వంటకాలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆహార స్టాళ్లు సందర్శకులకు సాంస్కృతిక అనుభూతిని కలిగిస్తున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన జూన్ 7 వరకు కొనసాగనుంది. తెలంగాణ చేనేత వైభవాన్ని తెలుసుకోవడానికి, అనుభవించడానికి, ప్రోత్సహించడానికి ఇది అరుదైన అవకాశంగా నిలవనుంది.

## యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు ప్రధాని సహా ప్రముఖుల శుభాకాంక్షలు

మొదటి పేజీ తరువాయి

ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పుట్టినరోజు (జూన్ 5) సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. సీఎం యోగి సుదీర్ఘకాలం పాటు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన  వేదికగా ప్రధాని మోదీ శుభాకాంక్షలు చెప్పారు. యూపీ ప్రగతికి సీఎం యోగి చేస్తున్న కృషిని ప్రధాని కొనియాడారు.’ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు. రాష్ట్ర పురోగతి కోసం ఆయన చేస్తున్న కృషి ఎంతో చెప్పుకోదగినది. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, సర్వతోముఖాభివృద్ధిని సాధించడంపైనే ఆయన ఎల్లప్పుడూ దృష్టి పెట్టారు. ఆయన నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను’ అని ప్రధాని తన సందేశంలో పేర్కొన్నారు.

**ప్రధానికి సీఎం యోగి ధన్యవాదాలు :** ప్రధాని మోదీ ఆత్మీయ శుభాకాంక్షలపై సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందిస్తూ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని చూపించే మార్గదర్శకత్వం, నమ్మకం తనకు నిరంతర స్ఫూర్తిని, శక్తిని ఇచ్చే వనరులని పేర్కొన్నారు. ‘గౌరవనీయ ప్రధానమంత్రి ఆత్మీయమైన, హృదయాన్ని హత్తుకునే శుభాకాంక్షలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ‘వికసిత ఉత్తర్‌ప్రదేశ్’ నిర్మాణ ప్రయాణంలో మీ మార్గదర్శకత్వం, విశ్వాసం, ఆత్మీయ బలం నాకు కొండంత అండ’ అని యోగి ట్వీట్ చేశారు.

## టీడీపీలో అనంత లొల్లి....

అనంతపురం : అనంతపురం నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీలో ముసలం మొదలయింది. అక్కడ మాజీ ఎమ్మెల్యేకు, ప్రస్తుత ఎమ్మెల్యేకు మధ్య గత కొన్నేళ్ల నుంచి పడటం లేదు. ప్రస్తుత ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ కు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మధ్య విభేదాలు మరింత ముదిరాయి. ఎంతగా అంటే.. తాను వచ్చే ఎన్నికల్లో అనంతపురం అర్బన్ నియోజకవర్గం నుంచి పోటీ చేయబోనని ప్రభాకర్ చౌదరి ప్రకటించారు. తాను పార్టీ హైకమాండ్ ను టిక్కెట్ ను కూడా కోరనని అన్నారు. అదే సమయంలో డీలిమిటేషన్ లో మరొక నియోజకవర్గంలో అవకాశమిస్తే వెళతానని, లేకుంటే పోటీకి దూరంగా ఉంటానని ప్రభాకర్ చౌదరి ప్రకటించారు. ఇందుకు కారణాలు కూడా లేకపోలేదు. గత ఎన్నికల్లో ప్రభాకర్ చౌదరిని కాదని తెలుగుదేశం పార్టీ నాయకత్వం దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ కు టిక్కెట్ ఇచ్చింది. కూటమి హవాలో ఆయన గెలుపొందారు. అయితే గెలిచిన నాటి నుంచి ప్రభాకర్ చౌదరిని పక్కన పెడుతూ వస్తున్నారు. ఆయన వర్గాన్ని కూడా దూరం పెడుతున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య సోషల్ మీడియాలో గత కొంతకాలంగా వార్ నడుస్తుంది.

## కాంగ్రెస్‌కు జేఎంఎం ఝలక్.. రెండు రాజ్యసభ సీట్లలో పోటీకి కసరత్తు

మొదటి పేజీ తరువాయి

జార్ఖాండ్‌లోని ‘ఇండియా’ కూటమిలో తాజాగా విభేదాలు పొడచూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. జార్ఖాండ్ నుంచి రెండు రాజ్యసభ సీట్లకు ఎన్నికల జరగాల్సి ఉండగా, రాష్ట్రంలో జేఎంఎం భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ ఒక సీటును ఆశిస్తోంది. పార్టీ నుంచి పోటీ చేసే రాజ్యసభ అభ్యర్థి పేరును ఇప్పటికే ప్రకటించింది. అయితే రెండు రాజ్యసభ స్థానాల్లోనూ పోటీ చేసేందుకు జేఎంఎం తాజాగా నిర్ణయం తీసుకోవడం ఆసక్తికరంగా మారింది. దీనిపై భాగస్వామ్య పార్టీల మధ్య విభేదాలు తలెత్తే అవకాశాలున్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. రాజ్యసభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై జేఎంఎం శాసనసభ్యులు, మంత్రులు, ఎంపీలు, సీనియర్ నేతలు శుక్రవారంనాడు సమావేశమయ్యారు. ఖాళీగా ఉన్న రెండు సీట్లలోనూ జేఎంఎం పోటీ చేయాలని సమావేశంలో ఏకాభిప్రాయం కుదరినట్టు సమావేశానంతరం రాష్ట్ర మంత్రి యోగేంద్ర మెహతో మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. అయితే దీనిపై తుది నిర్ణయం తీసుకునే బాధ్యత ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కే అప్పగించినట్టు వివరించారు. ఈ క్రమంలో రాజ్యసభకు పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేసేందుకు భాగస్వామ్య పార్టీలతో సోరెన్ సంప్రదింపులు చేపట్టనున్నట్టు తెలుస్తోంది. కాగా, కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే జార్ఖాండ్ నుంచి పోటీ చేసే అభ్యర్థితో పాటు ఏడు రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. భాగస్వామ్య పక్షంగా తమకు ఒక సీటును జేఎంఎం కేటాయిస్తుందనే అభిప్రాయంతో కాంగ్రెస్ ఉంది. రెండు సీట్లూ తమకే కావాలని జేఎంఎం పట్టుపడితే దీనిపై రాబోయే రోజుల్లో ఇరుపార్టీల మధ్య ముమ్మరంగా సంప్రదింపులు జరిగే అవకాశాలు ఉన్నాయి.

**జూన్ 18న రాజ్యసభ ఎన్నికలు**

వివిధ రాష్ట్రాల్లోని 24 రాజ్యసభ స్థానాలకు జూన్ 18న ఎన్నికలు జరుగనున్నాయి. జార్ఖాండ్‌లో చాలాకాలంగా జేఎంఎం, కాంగ్రెస్ భాగస్వాములుగా ఉన్నాయి. సోరెన్ నాయకత్వంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో కూడా ఉంది. రెండు రాజ్యసభ సీట్లు ఆశించడం ద్వారా జార్ఖాండ్ రాకీయాల్లో తమ బలం చెక్కుచెదరకూడదని జేఎంఎం భావిస్తుండగా, కూటమి ప్రభుత్వంలో తాము రాజకీయ ప్రాధాన్యం కోల్పోరాదని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది.

## టీఎంసీలో చిచ్చు... రెబల్ ఎమ్మెల్యేలతో 23 మంది ఎంపీల మంతనాలు

మొదటి పేజీ తరువాయి

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్కు మరిన్ని కష్టాలు తప్పేలా లేవు. పార్టీ రెబల్ గ్రూప్ ఎమ్మెల్యలతో 23 మంది ఎంపీలు ప్రస్తుతం సంప్రదింపులు సాగిస్తున్నట్టు ఆ పార్టీ వర్గాలు తాజాగా బాంబు పేల్చాయి. దీంతో రాబోయే రోజుల్లా టీఎంసీ పార్లమెంటరీ విభాగం నిట్టనిలువుగా చీలిపోయే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో ఇప్పటికే రెబల్ ఎమ్మెల్యేలు పట్టు సాధించారు. పార్టీ బహిష్కృత నేత రితబ్రత బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా 57 మంది టీఎంసీలు ఎమ్మెల్యేలు ఇటీవల ఎన్నుకున్నారు. ఆ ఎన్నికను స్పీకర్ రతీంద్ర బోస్ కూడా గుర్తించారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలు మమతా బెనర్జీని గౌరవిస్తున్నామని చెబుతూనే, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ నాయకత్వాన్ని మాత్రం ఒప్పుకునేది లేదని కరాఖండిగా చెబుతున్నారు.

తాజాగా టీఎంసీ ఎంపీల్లోనూ అసంతృప్తి పెల్లుబుకుతోంది. అభిషేక్ బెనర్జీ పట్ల పలువురు అసంతృప్తితో ఉన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్లమెంటరీ ప్రత్యేక కూటమిగా ఏర్పాటేందుకు వీరు చర్చలు జరుపుతున్నారని, 12 మందికి పైగా ఎంపీలు ఇందుకు సముఖంగా ఉన్నారని అంటున్నాయి.

**సంఖ్యాబలం ఉందా?**

టీఎంసీ పార్లమెంటరీ ప్రత్యేక కూటమిగా ఏర్పడేందుకు, చీలక తెచ్చేందుకు తగిన సంఖ్యాబలంపై కూడా చర్చ జరుగుతోందని చెబుతున్నారు. టీఎంసీకి లోక్‌సభలో ప్రస్తుతం 29 మంది ఎంపీలు ఉన్నారు. ప్రత్యేక గ్రూపుగా ఏర్పడి ఫిరాయింపుల చట్టం నుంచి వేటుపడకుండా ఉండాలంటే కనీసం 23 మంది మద్దతు ఇందుకు అవసరమవుతుంది. రాజ్యసభ పరంగా చూస్తే టీఎంసీకి 13 మంది ఎంపీలున్నారు. ప్రత్యేక గ్రూపుగా గుర్తింపు పొందాలంటే కనీసం 9 మంది ఎంపీలు కలిసిరావాలి. ఈ పరిణామాలపై రెబల్ నేత రీతాబత్ర బెనర్జీని ప్రశ్నించగా, గత వారం రోజుల్లో తాను ఏ ఎంపీతోనూ మాట్లాడలేదని, అందువల్ల వాళ్లు ఏమి చేయాలనుకుంటున్నారో తనకు తెలియదని చెప్పారు. అయితే రేపటిరోజు ఏమి జరుగుతుందో ఎవరూ చెప్పలేరని అన్నారు. దీనిపై వెటరన్ రాజ్యసభ ఎంపీ సుఖేందర్ శేఖర్ రాయ్ మాట్లాడుతూ, ఇంత తక్కువ సమయంలో 60 మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోవడం ఎప్పుడూ చూడలేదని, అదే స్పందన లోక్‌సభలోనూ ఉండే అవకాశాలు లేకపోలేదని అన్నారు.





# కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాటాలకు సిద్ధం కావాలి: ఎంపీ డీకే అరుణ

**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లా రెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ తరగతులను మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. బీజేపీ కార్యకర్తల కఠోర శ్రమ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజల విశ్వాసంతోనే పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో పార్టీ బలపడిందని అన్నారు. తెలంగాణలో కూడా బీజేపీ అధికారమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కంకణ బద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో స్థానిక సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాలు, దీక్షలు, నిరసనలు చేపట్టాలని సూచించారు. తెలంగాణను పదేళ్లపాటు బీఆర్ఎస్ దోచుకుందని, ప్రస్తుతం కాంగ్రెస్ కూడా అదే బాటలో నడుస్తోందని విమర్శించారు. భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడాన్ని ఎవరూ అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ హామీలు, వైఫల్యాలను ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి గాలి మోటారులో తిరుగుతూ గాలి మాటలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును గత ప్రభుత్వం పూర్తి చేయలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రెండున్నరేళ్లలో ప్రాజెక్టు పురోగతికి తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అర్హులను విస్మరించి రాజకీయ ప్రాధాన్యతలకు ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, ప్రస్తుతం జరుగుతున్న ప్రధాన రహదారి పనుల్లో ఎక్కువ భాగం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో చాలా వరకు అమలు కాలేదని, మహిళలు, రైతులు, యువత, నిరుద్యోగులు సహా అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. అనంతరం "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమంలో భాగంగా ట్రిపుల్ ఐటీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నాయకురాలు పద్మజారెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కర్ణంగూడను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి



**కర్ణంగూడ, (సమయం ప్రతినిధి):** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలం కర్ణంగూడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పాల్గొని గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది వర్ష

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి: కలెక్టర్

పాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని, భూమి, పంటల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని కోరారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఘన వ్యర్థాల నిర్వహణలో ఆదర్శంగా నిలవాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైన వెంటనే మొక్కలు నాటాలని, ప్రతి కుటుంబం ఒక మొక్కను సంరక్షించాలని పిలుపునిచ్చారు. గ్రామంలో మూతపడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పునఃప్రారంభించేందుకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డీసీపీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మక్తల్‌లో మళ్లీ మంచినీటి పైప్‌లైన్ లీకేజీ - ప్రజాధనం వృథాపై ఆందోళన





**మక్తల్, సమయం ప్రతినిధి :** నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు ఎల్‌బీ కాలనీ, శాంతినికేతన్ స్కూల్ ఎదుట మళ్లీ మంచినీటి పైప్‌లైన్ లీకేజీ ఏర్పడింది. ఈ లీకేజీ వారం రోజులుగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత వార్డు అధికారి ఇప్పటివరకు స్పందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే 16వ వార్డు కౌన్సిలర్ కూడా ఈ సమస్యపై కనీస పరిశీలన చేయలేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇదే ప్రదేశంలో గతంలో 7 నుంచి 8 సార్లు పైప్‌లైన్ లీకేజీలు జరగడంతో పలుమార్లు మరమ్మతులు చేసినప్పటికీ చివరికి మొత్తం పైప్‌లైన్ మార్చినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ మళ్లీ లీకేజీ జరగడం పనుల నాణ్యతపై అనుమానాలు రేకెత్తిస్తోంది. సంబంధిత ఫిట్టర్ వర్కర్ చేసిన పనులపై ప్రజల్లో ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తరచూ ఒకే చోట లీకేజీలు జరుగుతుండటంతో మున్సిపల్ అధికారులు, ఫిట్టర్ వర్కర్ కలిసి ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిట్టర్ వర్కర్ సూచించిన విధంగానే అధికారులు బిల్లులు మంజూరు చేస్తున్నారన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. పనులు జరుగుతున్న సమయంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే బిల్లులు ఆమోదిస్తున్నారని, ఇదే కారణంగా సమస్యలు పునరావృతమవుతున్నాయని స్థానికులు అంటున్నారు. గతంలో ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్‌కు అనేకసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సరైన స్పందన రాలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీలపై ఫిట్టర్ వర్కర్‌ను సంప్రదిస్తే అసభ్యంగా మాట్లాడుతున్నారని కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మున్సిపల్ కమిషనర్ మరియు మున్సిపల్ చైర్మన్ తక్షణమే స్పందించి సంబంధిత ఫిట్టర్ వర్కర్‌తో పాటు బాధ్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజాధనాన్ని కాపాడుతూ మక్తల్ పట్టణ ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## దేవరకొండలో ఉచిత కంటి వైద్య శిబిరం



**దేవరకొండ, సమయం ప్రతినిధి :** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యం క్యాంపు అభినందనీయం అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామంలో మునుకుంట్ల వెంకట్ రెడ్డి . సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం సందర్శించి కళ్లజోళ్లను అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సమాజ సేవా దృక్పథంతో ఈ క్యాంపును ఏర్పాటు చేసిన మునుకుంట్ల వెంకట్ రెడ్డి ని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు సమాజ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కంటి వ్యాధుల నివారణకు, ముందస్తు గుర్తింపుకు ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. అనంతరం క్యాంపు నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునికుంట్ల వెంకట్ రెడ్డి,స్థానిక ఉప సర్పంచ్ కడారి సైదులు, బొడ్డుపల్లి కృష్ణ, వడత్య బాలు, అప్పనాల తిరుమల, గుండాల వెంకట్,మల్లేష్,పాల్గొన్నారు.

## మోడీ ది రికార్డ్.... 9వ తేదీతో 12 ఏళ్ల 15 రోజులు పూర్తి...

న్యూఢిల్లీ : భారత రాజకీయాల్లో జూన్ 9, 2026 ఒక సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా నిలిచిపోనుంది. ఆ రోజుతో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశ చరిత్రలోనే అత్యధిక కాలం సేవలు అందించిన నేరుగా ప్రజలు ఎన్నుకున్న ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించబోతున్నారు. స్వతంత్ర భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న 12 ఏళ్ల 14 రోజుల రికార్డును ప్రధాని మోదీ అధిగమించనున్నారు. సాంకేతికంగా నెహ్రూ మొత్తం ప్రధానిగా ఉన్న కాలం ఎక్కువైనప్పటికీ.. ఆయన మొదటిసారి 1947లో మధ్యంతర ప్రభుత్వానికి ప్రధానిగా సెలెక్ట్ అయ్యారు తప్ప నేరుగా ప్రజల ద్వారా ఎన్నిక కాలేదు. కానీ, 2014 మే 26న మొదటిసారి నేరుగా ప్రజా బ్యాలెట్ ద్వారా ఎన్నికై ప్రధాని పీఠం అధిరోహించిన నరేంద్ర మోదీ, నాటి నుంచి నేటి వరకు నిరంతరాయంగా ప్రజామోదంతోనే ఈ రికార్డును సొంతం చేసుకుంటున్నారు. భారతదేశ మొదటి సార్వత్రిక ఎన్నికలు 1951-52లో జరిగాయి. అంతకంటే ముందు 1947 ఆగస్టు 15 నుండి జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటికీ.. అది రాజ్యాంగబద్ధంగా ప్రజల ఓట్లతో ఏర్పడిన ప్రభుత్వం కాదు. ఆ రకంగా చూస్తే నెహ్రూ నేరుగా ప్రజల ద్వారా ఎన్నుకున్న ప్రధానిగా కొనసాగిన నికర కాలం 12 ఏళ్ల 14 రోజులు మాత్రమే. నరేంద్ర మోదీ 2014 మే లో తొలిసారి, ఆ తర్వాత వరుస విజయాలతో నేరుగా ప్రజామోదం పొందుతూ ఈ రికార్డును బద్దలు కొడుతున్నారు. మోదీ సాధించిన ఈ ఘనతకు ఆయన నేతృత్వంలోని లీడర్‌షిప్, దేశవ్యాప్తంగా ఆయనకు ఉన్న తిరుగులేని ప్రజాదరణే ప్రధాన కారణం.

# ప్రభుత్వం పెంచిన మార్కెట్ విలువను వెంటనే విరమించుకోవాలి

**సూర్యాపేట టౌన్, సమయం ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం పెంచిన భూముల మార్కెట్ విలువ వెంటనే విరమించుకోవాలి. అని తెలంగాణ రాష్ట్ర రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ అధ్యక్షుడు పంతంగి వీరస్వామి గౌడ్. రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం నుండి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. రిజిస్ట్రేషన్ మార్కెట్ వ్యాల్యూ చార్జీలను గత ప్రభుత్వం పెంచిందని గుర్తు చేశారు. తిరిగి నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచితే సామాన్య ప్రజలకు ఇబ్బందిగా మారే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుతో రియల్ ఎస్టేట్ రంగం కుదేలు కానుందని వివరించారు. మార్కెట్ విలువలు పెరగడం వల్ల సామాన్య ప్రజలకు బిల్డింగ్ పర్మిషన్ తో పాటు ఎల్ ఆర్ ఎస్‌కు విపరీతంగా డబ్బులు ఖర్చు అయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ రేట్లు పెంచడంతో సామాన్య ప్రజలు కనీసం ఇంటిని నిర్మించుకునే పరిస్థితిలో ఉండలేరని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న చార్జీలని అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఒకవేళ భూముల మార్కెట్ వ్యాల్యూ పెంచితే రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ తగ్గించాలి 3% పర్సెంట్ చేయాలి గతంలో ఎల్ అర్ ఎస్ కోసం ఆన్లైన్లో 10000 రూపాయలు చెల్లించిన వారికి మున్సి పాలిటీ అధికారులు ఆప్షన్ తీసుకోవట్లేదు అని చెబుతున్నారు. అవి కూడా ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్ లేకుండా



రెగ్యులర్ చేసేటట్టు ప్రభుత్వం అమలు చేయాలి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తం గా ఎల్‌ఆర్‌ఎస్ కొరకు వెయ్యి రూపాయలు కట్టినవే అమలు చేస్తున్నారు పదవేల రూపాయలు కట్టినవి అమలు చేయట్లేదని అన్నారు. 142 సబ్ రిజిస్టర్ ఆఫీసులు ఉన్నవి ఒక పది మాత్రమే సుమారు సొంత భవనాలు ఉన్నవి మిగతా అన్ని అద్దె భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి వాటన్నిటిని కూడా పరిశీ లించి కొత్త భవనాలు స్థలాలు కేటాయించి నిధులు మంజూరు చేసి సబ్ రిజిస్టర్ కార్యాలయలు ఏర్పాటు చేసి సిబ్బంది కొరత లేకుండా ప్రభుత్వం చూడాలి అని వీరస్వామి గౌడ్ చెప్పుకొచ్చారు.

**తెలంగాణ రాష్ట రియల్ ఎస్టేట్ రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ అధ్యక్షుడు, పంతంగి వీరస్వామి గౌడ్**

సూర్యాపేటలో కృష్ణ కాలనీలో గత 20 సంవ త్సరాల క్రితమే సబ్ రిజిస్టర్ కార్యాలయానికి ఎనిమిది గుంటల స్థలం భూమి యజమానులు సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుకు రిజిస్ట్రేషన్ చేశారు. కావున దానికి నిధులు కేటాయించాలని సూర్యాపేట జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు. కొత్త భవనాలు ఏర్పాటు చేయాలి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సూర్యాపేట జిల్లా రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ అధ్యక్షుడు జలగం సత్యం గౌడ్ రియల్ ఎస్టేట్ జిల్లాగౌరవ అధ్యక్షుడు దేవత్ కిషన్ నాయక్. రాష్ట్ర కోశాధికారి పాల సైదులు, రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ బొమ్మగాని శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి అమరవాది శ్రావణ్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కంభంపాటి అంజయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్న శ్రీనివాస్ రెడ్డి సూర్యాపేట జిల్లా గౌరవ సలహాదారుడు మాదిరెడ్డి గోపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్య క్షుడు అయితే గాని మల్లయ్య గౌడ్ ఆకుల మారయ్య గౌడ్ పట్టణ కార్యదర్శి గిరీశం పట్టణ ఉపాధ్యక్షుడు బానోతు జానీ నాయక్ పట్టణ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకన్న పట్టణ ఉపాధ్యక్షుడు పట్టేటీ కిరణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడి లింగయ్య కిషోర్ కుమార్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల కమీషన్లు కొల్లగొట్టారు సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు

**మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి :** గత ప్రభుత్వ హయాంలో నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ నేతలు వేల కోట్ల రూపాయల కమీషన్లు కొల్లగొట్టారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కమీషన్లు దండుకొని ఒక్క ఎకరానికీ నీరు అందించలేదని ఆయన విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం పర్యటించిన ముఖ్యమంత్రి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా, పాలమూరు ప్రజలను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేస్తారనే ఆశలు ప్రజల్లో ఉన్నప్పటికీ, ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఎలాంటి మేలు జరగలేదని పేర్కొన్నారు. జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని, నీటి ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారం చేస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో నీటిపారుదల ప్రాజెక్టులపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేశారని, ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుపైనే రూ.లక్ష కోట్లు వెచ్చించారని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని, అది పూర్తయి ఉంటే 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని అన్నారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ పంపులు, లిఫ్టుల నిర్మాణానికే పరిమితమయ్యారని విమర్శించారు. నీటిపారుదల శాఖలో గత ప్రభుత్వం చేసిన అప్పుల భారాన్ని ఇప్పటికీ భరిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. గత 30 నెలల్లో రూ.52 వేల కోట్లకు పైగా అసలు, వడ్డీ చెల్లించినట్లు వెల్లడించారు. గతంలో ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ పూర్తిచేయకుండా పనులు చేపట్టారని, పునరావాస ప్యాకేజీలు ఇవ్వకుండా రిజర్వాయర్లలో నీరు నింపడం సాధ్యమా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రణాళికలు రూపొందిస్తూ ప్రాజెక్టుల పూర్తి దిశగా ముందుకు సాగుతోందన్నారు. త్వరలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేస్తామని, అభివృద్ధి పనులకు అడ్డంకులు సృష్టించవద్దని ప్రతిపక్షాలకు సూచించారు.

## కాంగ్రెస్ గూటికి జగన్ శివకుమార్ కు అధిష్టానం టాస్క్

విజయవాడ : కర్ణాటక కొత్త ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు తీసుకొనున్నారు. ఇటీవల సిద్దరామయ్య తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అగ్ర నాయకత్వం వ్యూహాత్మకంగా డీకే శివకుమార్ కు కర్ణాటక బాధ్యతలు అప్పగించింది. అయితే కేవలం కర్ణాటకలో రాజకీయ ప్రయోజనాలు పొందడం కాదు.. దక్షిణ భారతదేశంలో బలమైన శక్తిగా కాంగ్రెస్ పార్టీని తీర్చిదిద్దేందుకు డీకే శివకుమార్ ద్వారా అగ్ర నాయకత్వం బలమైన స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తెలంగాణ, కర్ణాటక, కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నాయి. తమిళనాడులో కాంగ్రెస్ సహకారంతో విజయ్ ప్రభుత్వం నడుస్తోంది. దక్షిణాది రాష్ట్రాలను మరింత బలమైన క్యారిడార్ గా రూపొందించుకొని.. 2029 ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాలు దక్కించుకోవాలన్నది కాంగ్రెస్ అగ్ర నాయకత్వం ప్లాన్. అయితే కాంగ్రెస్ పార్టీకి ఎంతో కొంత లోటు అనేది ఏపీ నుంచి ఉంది. దానిని భర్తీ చేసే బాధ్యతను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. డీకే శివకుమార్ కు అప్పగించినట్లు తెలుస్తోంది.ఏపీలో కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంక్ అంత జగన్మోహన్ రెడ్డి వైపు ఉంది. షర్మిల ద్వారా దాని టర్న్ చేసే ప్రయత్నం జరిగిన వర్కౌట్ కావడం లేదు. ఇప్పుడున్న ఏకైక మార్గం జగన్మోహన్ రెడ్డి వద్ద ఉన్న ఓటు బ్యాంకు కాంగ్రెస్ పార్టీ వైపు టర్న్ చేయడం.. లేకుంటే జగన్మోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం.. అది కాదంటే జగన్మోహన్ రెడ్డితో పొత్తు పెట్టుకోవడం. అయితే కాంగ్రెస్ పార్టీతో దోస్తీ అంటేనే అంత ఈజీగా జగన్మోహన్ రెడ్డి ఒప్పుకునే పరిస్థితి లేదు. అది డీకే శివకుమార్ ద్వారా చేయాలన్నది రాహుల్ గాంధీ ప్లాన్. రాజశేఖర్ రెడ్డి ఉన్న నాటి నుంచి కుటుంబ, వ్యాపార సన్నిహితుడు డికె శివకుమార్. ఆ కుటుంబం బలం, బలహీనతలు తెలుసు. పైగా ఆస్తి పంచాయితీలు ఇప్పుడు నడుస్తున్నాయి. ఆపై జగన్మోహన్ రెడ్డికి బెంగళూరులో విలువైన ఆస్తులు ఉన్నాయి. ఈ పరిణామాల క్రమంలో డీకే శివకుమార్ జగన్మోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీతో కలపగల శక్తి కలిగి ఉన్నారు. అందుకే అగ్రనేత రాహుల్ కీలక టాస్క్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

## ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు జూలై 2027 నాటికి పూర్తి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్ :** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల నీటిపారుదల పథకం పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథక పనులను పరిశీలించిన అనంతరం ఉదండాపూర్ రిజర్వాయర్‌ను సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీ, మ్యాపులను పరిశీలించి అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రధాన ట్రంక్‌లో ఉదండాపూర్ జలాశయం ఐదవది కాగా, ప్యాకేజీ-16, 17, 18ల పరిధిలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మొత్తం



రూ.7,802.91 కోట్ల వ్యయంతో చేపట్టిన పనుల్లో ఇప్పటివరకు రూ.5,126.59 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. ఇది మొత్తం పనుల్లో 65.70 శాతంగా అధికారులు వెల్లడించారు. జలాశయం పూర్తి చేసేందుకు ఇంకా రూ.2,675.91 కోట్ల విలువైన భౌతిక పనులు మిగిలి ఉండగా, వాటిని జూలై 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. దక్షిణ ప్రధాన కాలువతో కలిపి ఈ జలాశయం కింద 9,36,685 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు అనిరుధ్ రెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జి. మధుసూదన్ రెడ్డి, శంకర్, సంపత్, కాసిరెడ్డి నారాయణ రెడ్డి, మేఘారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పాలమూరు ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేస్తాం: సీఎం రేవంత్ రెడ్డి

**సమయం ప్రతినిధి, జడ్చర్ల :** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లా లోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను రాబోయే రెండేళ్లలో పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మీడియా సమావేశం లో మాట్లాడిన ఆయన గత ప్రభుత్వ పాల నపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ ఏర్పడితే పాలమూరు ప్రాజెక్టులు పూర్తవు తాయని ప్రజలు ఆశించారని, కానీ పదేళ్ల పాలనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసిన ప్పటికీ ఆశించిన ఫలితాలు సాధించలేదన్నారు. అందులో లక్ష కోట్ల రూపాయలు కాళేశ్వరం ప్రాజెక్టుకే వెచ్చించారని పేర్కొన్నారు. పాలమూరు-రంగా రెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా 90 టీఎంసీల నీటిని అందించే అవకాశం ఉన్నప్పటికీ దానిని నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి తదితర ప్రాజెక్టులతో పాటు పాలమూరు-రంగారెడ్డి పథకాన్ని పూర్తి చేసి ఉంటే జిల్లాలో 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని తెలిపారు. ఏ ప్రాజెక్టు పూర్తి కావాలన్నా ముందుగా భూసేకరణ జరగాలని, కానీ గత ప్రభుత్వ హయాంలో అవసరమైన భూసేకరణ చేపట్టలే దన్నారు. పంపులు, లిఫ్టుల పేరిట వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి కమీషన్లు పొందడంపైనే దృష్టి పెట్టారని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి గత పదేళ్లలో రూ.84,503 కోట్ల అప్పులు చేశారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 30 నెలల్లో రూ.52,120 కోట్ల అప్పులు చెల్లించిందన్నారు. అదే సమయంలో కాంట్రాక్టర్లకు రూ.22 వేల కోట్లు చెల్లించగా, అందులో రూ.8 వేల కోట్లు పాలమూరు ప్రాజెక్టులకే వెచ్చించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం



కూడా ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 4 వేల ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉందని, ప్రజల సహకారంతో ఆ ప్రక్రియను పూర్తి చేసి పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు 90 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పడం వాస్తవాలకు విరుద్ధమని, అంచనా వ్యయంలో సగం కూడా ఖర్చు కాకుండా 90 శాతం పనులు పూర్తవడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. పాలమూరు జిల్లా ప్రాజెక్టులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికే తన పర్యటన ఉద్దేశమని పేర్కొన్న సీఎం, భూసేకరణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఇప్పుడు ఈ పనులు పూర్తి చేయకపోతే భవిష్యత్తులో అవకాశం ఉండదని, చరిత్ర క్షమించదని అన్నారు. జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు తాను సంపూర్ణంగా కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు.

# పాలమూరు జిలాల్లో సాగునీటి ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ ఇవ్వని ముఖ్యమంత్రి




- జూరాల,గట్టు, ర్యాలంపాడు లిఫ్ట్ ప్రాజెక్టులపై నిరాశ..
- పాలకులు మారినా ప్రాజెక్టుల సమస్యలు మారడం లేదు..
- టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గొంగళ్ళ రంజిత్ కుమార్

**సమయం ప్రతినిధి, జోగులాంబ గద్వాల:** ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన కోసం సుడిగాలి పర్యటన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం హడావుడికే పరిమితమయ్యారు తప్ప స్పష్టమైనటువంటి హామీ ఇవ్వకుండగా నిధులు కేటాయిం చకుండా వేనుదిరిగారని జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులపై ప్రాజెక్టుల యొక్క సమస్యలు మరియు భూసేకరణ పెండింగ్ ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ ఇవ్వకుండా ఉమ్మడి జిల్లా కు నిరాశ కల్పించారని (తెలంగాణ రక్షణ సేన) టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గొంగళ్ళ రంజిత్ కుమార్ తెలిపారు. గద్వాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో నిన్న రెండు రోజులపాటు పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ప్రాజెక్టులపై జోగులాంబ గద్వాల జిల్లాలో ఉన్నటువంటి పెండింగ్ ప్రాజెక్టులపై ఎలాంటి స్పష్టత ఇవ్వకుండా, జిల్లా ప్రజలను నిరాశకు గురి చేశారని మండిపడ్డారు. అలాగే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు డిండి ప్రాజెక్టు లింకు విషయమై ఉమ్మడి జిల్లా వాసులు వ్యతిరేకిస్తున్నప్పటికిని రద్దు చేయలేదని అన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూరాల ప్రాజెక్టు, గుడ్డెందొడ్డి మరియు ర్యాలంపాడు రిజర్వాయర్, గట్టు లిఫ్టు ప్రాజెక్టులపై అనేకమైన హామీలు ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేసినప్పటికీ, ప్రాజెక్టులపై పూర్తి మొండి చేయి చూపారని ధ్వజమెత్తారు.జూరాల ప్రాజెక్టు పూడికతీత తీయక పోవడం వల్ల పూర్తిస్థాయిలో నిల్వ చేయలేకపోతున్నారని అలాగే నాలుగు టీఎంసీల సామర్థ్యం ఉన్న ర్యాలంపాడు ప్రాజెక్టు లీకేజీల కారణంగా రెండు టీఎంసీలకు మించి పూర్తిస్థాయిలో నింపడం లేదన్నారు.ఈ సమస్యతో జిల్లాలో సాగునీరు అందక రైతులు గోస పడుతున్నారని తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా రెండు లక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందిస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్న పాలకులు ఇప్పటికీ కనీసం ఎనభై వేల ఎకరాలకు కూడా సాగునీరు అందించడం లేదని అన్నారు. తుంగభద్ర, కృష్ణానది చుట్టూ నీరున్నా నడిగడ్డ ప్రాంతం కరువు నేలగా మారిందని,అనేక ప్రభుత్వాలు హామీలు ఇచ్చినప్పటికీ గట్టు ఎత్తిపోతల పథకం పూర్తి కాలేదన్నారు. అలాగే గుడ్డెందొడ్డి ప్రాజెక్టును పెంపు సాధించి, సాగునీరు అందిస్తామని చెబుతున్న ప్రభుత్వాలు మరియు పాలకులు హామీలు నెరవేర్చడం లేదని తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉన్న గుడ్డెందొడ్డి కుడి,ఎడమ కాల్వలు అసంపూర్తిగా ఉండడంతో రైతులకు సాగునీరు అందడం లేదు అని అన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా కాల్వలకు మరమ్మతులు పూర్తి చేయకుండా, భూసేకరణ పూర్తి చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. జూరాల ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పూడిక తీస్తే, 9 టి.ఎం.సి లకు పైగా నీటి సామర్థ్యం నిల్వ ఉంచడానికి అవకాశం ఉంటుందని, అలాగే ప్రాజెక్టు యొక్క గేట్లు మరమ్మతులు చేపట్టడానికి త్వరితగతిన నిధులు మంజూరు చేసి ప్రాజెక్టుల యొక్క సమస్యలను తీర్చాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ నాయకులుపార్టీ నాయకులు మల్దకల్ మండల అధ్యక్షుడు విష్ణు, మండల నాయకులు లక్ష్మన్న,మల్దకల్, మునెప్ప, సుభాష్,శాంతన్న, గోవిందు, కృష్ణ,గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## మల్దకల్‌లో ప్రీ-ప్రైమరీ పాఠశాలల టీచింగ్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ



**దరఖాస్తులను పరిశీలిస్తున్న మండల విద్యాధికారి (MEO)**
**ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల పెంపునకు చర్యలు**

**మల్దకల్ (జోగులాంబ గద్వాల జిల్లా), సమయం ప్రతినిధి :** మండల కేంద్రంలోని మల్దకల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా ప్రారంభం కానున్న ప్రీ-ప్రైమరీ తరగతుల్లో బోధన కొరకు అభ్యర్థుల నుండి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా సాగింది. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో మండల విద్యాధికారి (MEO) ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన మహిళా అభ్యర్థులు, ఉపాధ్యాయ పోస్టుల కొరకు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో విచ్చేసి దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, మండలంలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. చిన్న వయస్సు నుంచే పిల్లలకు నాణ్యమైన పునాది విద్యను అందిం చడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. వచ్చిన దరఖాస్తులను మెరిట్ మరియు నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా పరిశీలించి తగిన అభ్యర్థులను ఎంపిక చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది, సిఆర్పీలు మరియు పెద్ద సంఖ్యలో ఉద్యోగార్థులు పాల్గొన్నారు.

## కొడాలి అర్జున్ ఎంట్రీ....

మచిలీపట్టణం : మాజీ మంత్రి కొడాలి నాని రాజకీయ వారసుడిపై క్లారిటీ వచ్చేసింది. మాజీ మంత్రి పేర్ని నాని కొడాలి నాని రాజకీయ వరసుడు ఎవరో చెప్పేశారు.. 2034 ఎన్నికల్లో కొడాలి అర్జున్ గుడివాడ నుంచి బరిలో ఉంటాడని ప్రకటించారు. కొడాలి నానితో కలిసి అర్జున్ గుడివాడలో సర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంలో పేర్నినాని కీలక ప్రకటన చేశారు. గుడివాడ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం జరిగింది.. మాజీ మంత్రి కొడాలి నాని రాజకీయ వారసత్వంపై కీలక ప్రకటన వచ్చేసింది. కొడాలి నాని రాజకీయ వారసుడు ఎవరో మాజీ మంత్రి కొడాలి నాని ప్రకటించారు. గుడివాడ లింగవరంలోని కె కన్వెన్షన్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)పై వైఎస్సార్‌సీపీ నేతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నానిలతో పాటుగా వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ వేదికపై నుంచి మాజీ మంత్రి పేర్ని నాని కొడాలి నాని రాజకీయ వారసుడు కొడాలి అర్జునరావు అంటూ ప్రకటించారు. కొడాలి అర్జున్ 2034 ఎన్నికల్లో పోటీచేస్తారని పేర్ని నాని తెలిపారు.కొడాలి అర్జున్ నాని సోదరుడి కుమారుడు.. కొంతకాలంగా గుడివాడ వైఎస్సార్‌సీపీలో యాక్టివ్ అయ్యారు. గుడివాడలో సర్‌పై నిర్వహించిన సదస్సుకు అర్జున్ వచ్చారు.. వేదికపై మాజీ మంత్రులు, పార్టీ నేతల మధ్య కూర్చున్నారు. అర్జున్ 2034 ఎన్నికల్లో పోటీచేస్తారని ప్రకటించడంతో.. 2029 ఎన్నికల్లో కొడాలి నాని ఎన్నికల బరిలో ఉంటారనే క్లారిటీ వచ్చింది. కొడాలి నానికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.. కానీ తన సోదరుడి కుమారుడు అర్జున్‌ను రాజకీయ వారసుడిగా ప్రకటించారు. గతంలో కూడా పలు సందర్భాల్లో కొడాలి నాని తన రాజకీయ వారసత్వం గురించి ప్రకటనలు చేశారు. 2024 ఎన్నికల సమయంలో కూడా కొడాలి నాని సోదరుడి కుమారుడు అర్జున్ తన రాజకీయ వారసుడని ప్రకటించిన సంగతి తెలిసిందే. తనకు 2024 ఎన్నికలే చివరివి అని చెప్పారు. 2029 ఎన్నికల్లో తాను పోటీచేయనని.. తన వయసు గురించి ప్రస్తావించారు. 2029 ఎన్నికల సమయానికి తనకు 58 ఏళ్లు వస్తాయని.. తాను ఆ వయసులో మళ్లీ ఎన్నికల్లో పోటీచేయలేనని చెప్పుకొచ్చారు. తన కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లోకి రారని.. తన ఇద్దరు కుమార్తెలకు రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తి లేదన్నారు. తన తమ్ముడి కుమారుడు రాజకీయాల్లోకి వస్తారని చెప్పారు. ఇప్పుడు మాజీ మంత్రి పేర్ని నాని ప్రకటనతో కొడాలి అర్జున్ పొలిటికల్ ఎంట్రీ ఖాయమైందనే చర్చ జరుగుతోంది.మరోవైపు గుడివాడలో జరిగిన సర్ సదస్సులో మాజీ మంత్రి పేర్ని నాని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో గుడివాడ, గన్నవరం సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు లేవని టీడీపీలో చర్చ జరుగుతోందన్నారు. సర్ విషయంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సర్ కారణంగా తమిళనాడులో స్టాలిన్, పశ్చిమ బెంగాల్‌లో మమత బెనర్జీ ఓడిపోయారన్నారు మాజీ మంత్రి కొడాలి నాని. వారు పోటీచేసిన నియోజకవర్గాల్లో ఓట్లు తొలగించడంతోనే ఇలా జరిగిందని చెప్పుకొచ్చారు. సర్ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

## లోకల్ బాడీ ఎన్నికలకు కమిటీ

విజయవాడ : ఏపీలో ఒక రకమైన అనుమానం ఉండేది. కూటమి ప్రభుత్వం ఎన్నాళ్లు నడుస్తుందో చెప్పలేం అన్నవారు ఎక్కువగా ఉండేవారు ఎన్నికల సమయంలో. ఎందుకంటే చాలా రాజకీయ పార్టీల మధ్య పొత్తు కొద్ది రోజులకే విచ్ఛిన్నం అవుతూ వచ్చింది. అలాగే ఏపీలో కూటమిలోని టిడిపి, జనసేన మధ్య విభేదాలు వస్తాయని ఎక్కువ మంది ఆశించారు. కానీ వారి ఆశలు తీరలేదు. గత రెండేళ్లుగా రెండు పార్టీల మధ్య బంధం పెరుగుతుందే తప్ప తగ్గేదిగా కనిపించడం లేదు. అయితే క్షేత్రస్థాయిలో క్యాడర్ మధ్య మాత్రం విభేదాలు ఉన్నాయి. ఆ విషయం ఇరుపార్టీల అధినేతలకు తెలుసు. అయితే విభేదాలు ఎంత ఉన్నాయో అంతకుమించి ప్రచారం చేస్తోంది వైసీపీ సోషల్ మీడియా. ఏదైనా పరిణామం జరిగితే చాలు సోషల్ మీడియాను నింపేస్తోంది. కానీ వారి మధ్య ఎటువంటి అరమరికలు లేకుండా సజావుగా కొనసాగుతోంది పొత్తు. అయితే ఎంత పొత్తు ఉన్న ఓట్ల బదలాయింపు జరిగితేనే.. దానికి సరైన ఫలితం వస్తుంది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఇదే మాదిరిగా సత్ఫలితం చూసింది కూటమి. అయితే మరోసారి అటువంటి ఫలితాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో చూడాలని భావిస్తున్నారు సీఎం చంద్రబాబు.ఏపీలో స్థానిక సంస్థలకు సంబంధించి పాలకవర్గాల గడువు ముగిసింది. ప్రత్యేక అధికారుల పాలన నడుస్తోంది. త్వరలో ఎన్నికలకు వెళ్లేందుకు సన్నాహాలు చేస్తోంది ప్రభుత్వం. అయితే చంద్రబాబు జరుపుతున్న ఈ జాప్యం వెనుక చాలా రకాల వ్యూహాలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా స్థానిక సంస్థల్లో సైతం కూటమి పార్టీల మధ్య ఓట్ల బదలాయింపు జరగాలన్నది చంద్రబాబు ప్రణాళిక. అందుకు ఆయన ఒక వ్యూహం రూపొందించారు. నియోజకవర్గ, మండల స్థాయిలో ఎన్డీఏ సమన్వయ కమిటీ సమావేశాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ నెల నాలుగున జరగనున్న ఎన్డీఏ సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించనున్నారు.సార్వత్రిక ఎన్నికల వరకు పొత్తు ఓకే. కానీ స్థానిక సంస్థల ఎన్నికలు అలా కాదు. అక్కడ స్థానిక పరిస్థితులు విపరీతంగా ప్రభావం చూపుతాయి. నేతలు ఆశావహులుగా ఉంటారు. ఈ క్రమంలో ఎన్నికలు నిర్వహిస్తే కూటమి నేతల మధ్య ఘర్షణతో పాటు వివాదాలు జరుగుతాయి. దీనిని ముందుగానే గ్రహించారు సీఎం చంద్రబాబు. అందుకే కూటమి సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఏ మండలంలో ఎవరు జడ్పిటిసి గా పోటీ చేయాలి? సర్పంచ్ గా ఎవరికి అవకాశం కల్పించాలి? ఎంపీపీగా ఎవరికి ఛాన్స్ ఇవ్వాలి? ఆశావహుడు ఎప్పుడు నుంచి పనిచేస్తున్నారు? స్థానికంగా బలం ఎంత? ఇలా అన్ని వివరాలను ఆరా తీస్తుంది ఈ కమిటీ.

## కరివేనలో సీఎంకు జిఎంఆర్ ఘన స్వాగతం



**(సమయం ప్రతినిధి దేవరకద్ర):** పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలోని కరివేన రిజర్వాయర్ పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రివర్యులు శ్రీ. జూపల్లి కృష్ణారావు వాకిటి శ్రీహరి కి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే జియంఆర్, జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులతో కలిసి పాలమూరు - రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలో భాగమైన ప్యాకేజీ - 14 & 15 (కరివేన రిజర్వాయర్) పనులను ముఖ్యమంత్రి, ఇరిగేషన్ శాఖ మంత్రి తనిఖీ చేశారు.

## రాజ్యసభ టికెట్లపై టీడీపీ నేతల్లో టెన్షన్..

తిరుపతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజ్యసభ టీడీపీ ఆశావాహుల్లో కొత్త టెన్షన్ పట్టుకుంది. అతి త్వరలో రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్న వేళ సీట్ల భర్తీ ప్రక్రియ వేగవంతమైంది. ఈ క్రమంలో రాజ్యసభ సీటు కోసం టీడీపీ ఆశావాహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రాజ్యసభ టికెట్ కోసం టీడీపీ నేతలు గట్టిగానే పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు చుట్టూ నేతలంతా ప్రదక్షిణలు చేస్తున్న పరిస్థితి నెలకొంది.తమకు ఎలాగైన రాజ్యసభ సీటుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దాంతో రాష్ట్ర సచివాలయం, పార్టీ హెడ్ క్వార్టర్స్ వద్ద చంద్రబాబును వ్యక్తిగతంగా కలిసేందుకు క్యూ కడుతున్నారు. తాము పార్టీ కోసం ఎంతగా కష్టపడ్డారో ఎన్ని సేవలు చేశారు? రాజకీయ అనుభవాల గురించి వివరించే పనిలో పడ్డారు.అయితే, ఈ క్రమంలో రాజ్యసభ రేసులో రాష్ట్రంలోని పలువురు ప్రముఖ టీడీపీ నేతల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అందులో కిలారు రాజేష్, సానా సతీష్, కంభంపాటి రామ్మోహన్ రావు, టీడీ జనార్దన్, గల్లా జయదేవ్, భాష్యం రామకృష్ణ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరిలో కొందరు పార్టీకి ఆర్థికంగానూ మరికొందరు రాజకీయంగా చేసిన సేవలను అధిష్ఠానం ముందు ప్రస్తావిస్తున్నట్లు తెలుస్తోంది.అందులోనూ సామాజిక సమీకరణాలు సైతం రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో కీలకంగా మారాయి. ముఖ్యంగా ఎస్సీ కోటాలో సీనియర్ నేత వర్ల రామయ్య పేరు బలంగా వినిపిస్తోంది. అలాగే, ఉత్తరాంధ్ర ప్రాంతానికి ప్రాధాన్యం వహించే చింతకాయల విజయ్‌కు బీసీ కోటాలో అవకాశం లభించే ఛాన్స్ ఉందంటూ చర్చ నడుస్తోంది. ఇక రాయలసీమ నుంచి రెడ్డప్పగారి శ్రీనివాస్ రెడ్డి, లింగారెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. బీసీ వర్గం నుంచి మాత్రం తిప్పేస్వామి కూడా రేసులో ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం.ఇదిలా ఉంటే.. తెలంగాణ ప్రాంతానికి చెందిన కొత్త ముఖాలకు కూడా ఈసారి రాజ్యసభలో సీటు దక్కుతుందనే ప్రచారం కూడా జోరుగా కొనసాగుతోంది. ప్రస్తుతం ఏపీ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.అసలు ఇప్పటివరకు పెద్దగా చర్చలో లేని కొందరి పేర్లు కూడా చివరి నిమిషంలో తెరపైకి వచ్చే అవకాశం కూడా ఉందని టీడీపీ శ్రేణుల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే మహిళలకు ప్రాధాన్యం వహించేలా ఒక మహిళకు రాజ్యసభ అవకాశం కల్పించే అంశాన్ని అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**జనసేనకు ఒక సీటుపై క్లారిటీ? :**

అదేవిధంగా, ఎన్డీఏ కూటమి సమీకరణాలు సైతం ఈసారి రాజ్యసభ సభ్యుల ఎంపిక ప్రక్రియలో కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ఈసారి జనసేనకు ఒక రాజ్యసభ సీటు కేటాయించే అంశంపై స్పష్టత వచ్చినట్టు తెలుస్తోంది. ఒకవేళ జనసేనకు అవకాశమిస్తే.. ఆ పార్టీ తరపున లింగమనేని రమేష్ పేరు దాదాపు ఖరారైనట్లేనన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది.







# గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి...

## అంతర్రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్

**(సమయం ప్రతినిధి గద్వాల) :** గద్వాల నియోజకవర్గం ధరూర్ మండలం పెద్దపాడు గ్రామంలో శ్రీశ్రీశ్రీ సవారమ్మ అవ్వ ఊర్ల దేవర మహోత్సవం సందర్భంగా నిర్వహించిన అంతర్రాష్ట్ర స్థాయి ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై,రిబ్బన్ కట్ చేసి, కొబ్బరికాయ కొట్టి, ప్రారంభించారు. అంతక ముందు,బాసు హనుమంతు నాయుడుని గ్రామ నాయకులు,క్రీడాకారులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల నిర్వహణ వల్ల గ్రామాల మధ్య సత్సంబంధాలు మెరుగుపడుతాయని బాసు హనుమంతు నాయుడు అన్నారు...శ్రీశ్రీ సవారమ్మ అవ్వ దేవర మహోత్సవం సందర్భంగా అంతర్రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు..ఇలాంటి క్రీడా పోటీల నిర్వహణ వల్ల యువకుల మధ్య స్నేహబంధం పెరగడంతో పాటు ఆటల పట్ల పట్టుదల పెరుగుతోందని అన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడలు ప్రతి ఒక్క క్రీడాకారులు చక్కటి ప్రదర్శన ఇచ్చి గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మీ ప్రదర్శనలు



తీయాలని,భవిష్యత్తులో ఇలా రంగంలో అత్యున్నత స్థాయికి ఎదిగి గద్వాల ప్రాంతానికి కూడా మంచి పేరు వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు.విద్యతో పాటు క్రీడ నైపుణ్యత పొంది క్రీడా రంగంలో కూడా రాణించాలి అని కోరారు...క్రీడల్లో గెలుపు ఓటములు సహజమే, ఓడిపోయినా నిరుత్సాహం పడకూడదు,గెలిచాము అని గర్వపడవద్దు అని అన్నారు. స్నేహపూర్వకంగా క్రీడలను ఆడి, ఓడిపోయినా ఓటమి వజయానికి నాందిగా భావించాలని పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందని గుర్తు చేశారు..ఈ కార్యక్రమంలో జి.రాఘవేంద్ర రెడ్డి, అల్లపాడు ప్రతాప్, చిన్నపాడు ఆంజనేయులు,కౌన్సిలర్ జగదీష్,వెంకటేష్ నాయుడు, సోమశేఖర్ రెడ్డి,రాముడు, లక్ష్మారెడ్డి, శ్రీరాములు, ఆంజనేయులు, గొనుపాడు మాలిక్,చిన్న,రవి, చంద్రశేఖర్, తిమ్మప్ప,మహేంద్ర,రాజు, మహేష్, కృష్ణ,వీరేష్, చంటి,మోహన్,ముని,హరికృష్ణ, జయన్న, వెంకటప్ప,శివా మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

---

## విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా విద్యా పరిరక్షణ కమిటీ (TSEC) మహా ధర్నా విజయవంతం




హైదరాబాద్ : తెలంగాణలో కుప్పకూలుతున్న ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవడానికి, విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలను నిరసిస్తూ 'తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ (TSEC) ఆధ్వర్యంలో ఈరోజు కవాడిగూడ (ACTC కాలేజీ) నుండి ఇందిరా పార్క్ వరకు నిర్వహించిన భారీ ర్యాలీ అంతంతరం, మహా ధర్నా విజయవంతమైంది. వివిధ ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘాల సమరశీల ఐక్యతతో TSEC చేసిన ధర్నాతో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ హోరెత్తింది.ఈ సందర్భంగా మాట్లాడుతున్న CPI(ML)మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ప్రొఫెసర్ హరగోపాల్, మాడ భూషణ్ శ్రీధర్, ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ లక్ష్మి నారాయణ , ప్రొఫెసర్ చక్రధర్ రావు పాల్గొన్నారు. PYL రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దింటి రామకృష్ణ PDSU రాష్ట్ర అధ్యక్షులు కంపాటి పృథ్వి మేధావులు, వివిధ ఉపాధ్యాయ,విద్యార్థి, యువజన,ప్రజాసంఘాల నేతలు తదితరులు ప్రసంగించారు.

## ట్రెండింగ్ లో లేబర్ అడ్డా

గుంటూరు : ఏదైనా భవన నిర్మాణమైనా, రోడ్డు నిర్మాణమైనా? అందుకోసం చాలా మంది కార్మికులు అవసరం. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టు.. ఆయా నిర్మాణాల కోసం సరిపడ డబ్బు, ఇతరత్రా సామాగ్రి ఉన్నా.. కార్మికులు లేకపోతే? ఆ పని ఇంచు కూడా కదలదు.ఇప్పుడు అన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు జోరుగా సాగుతున్న వేళ? కార్మికుల పాత్ర మరింతగా పెరిగిపోయింది. ఇక ఏపీ రాజధాని అమరావతి విషయానికి వస్తే? వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు వస్తున్నారు. వెళుతున్నారు. ఒక్కో కాంట్రాక్టరు ఒక్కో రీతిన వ్యవహరిస్తున్న కారణంగా కార్మికులు ఇబ్బందులు పడుతున్న వైనం స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే కార్మికుల వసతి కోసం పక్కా ఏర్పాట్లు చేయాలని కూటమి సర్కారు తన కాంట్రాక్టర్ల తెగేసి చుబుతోంది.కాంట్రాక్టర్లకు మాట మాత్రంగా చెప్పడానికి బదులుగా అసలు కార్మికుల వసతి కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయాలి? ఆయా లేబర్ అడ్డాల్లో ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి? వంటి విషయాలను విస్పష్టంగా చెప్పేందుకు కూటమి సర్కారు రంగంలోకి దిగింది. ఇంటిగ్రేటెడ్ లేబర్ అమెనిటీస్ సెంటర్ (లేబర్ అడ్డా) నమూనాను గుంటూరులో ఏర్పాటు చేసింది. అందులో కార్మికుల వసతి కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లను కళ్లకు కట్టినట్టు చూపింది.

---

# జడ్చర్లలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా పలకరించిన మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్

**(సమయం ప్రతినిధి జడ్చర్ల) :** ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత నాదే" అని ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జడ్చర్లలో నిర్వహించిన బహిరంగ సభకు విచ్చేసిన ముఖ్యమంత్రివారిని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ తో కలిసి మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కర్వేన ప్రాజెక్టు సందర్శన అనంతరం పాత్రికేయ మిత్రులతో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రివారు, అనంతరం జడ్చర్ల బహిరంగ సభలో పాల్గొని పాలమూరు జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, రైతుల సంక్షేమం జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లే కార్యాచరణపై తన దృక్పథాన్ని వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలు, పాలమూరు జిల్లా ప్రగతి, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రివారికి శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో



ముందుకు నడిపించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

# జగన్ కు బీఆర్ఎస్ స్థానంలో కవిత

విజయవాడ : వైసీపీ అధినేత జగన్‌కు ఇరుగు పొరుగు రాష్ట్రాల మద్దతు ఉన్న విషయం తెలిసిందే. సమయం చూసుకు ని స్పందించే నాయకులు ఉన్నారు. అయితే.. ఒక్కొక్కసారి ఆయనను విమర్శించిన పొరుగు రాష్ట్ర నేతలు కూడా కనిపిస్తారు. హరీష్‌రావు, కేటీఆర్‌వంటి తెలంగాణ నాయకులు జగన్‌కు మిత్రులే అయినా.. సమయం సందర్భం చూసుకుని ఆయనను సమర్థించారు. ఒక్కొక్కసారి తీవ్రంగా విమర్శించారు. 4 వేల కోట్ల కోసం.. జగన్.. రైతులను ఫణంగా పెట్టారంటూ.. గతంలో హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. అప్పట్లో రైతులు వాడే విద్యుత్‌కు స్మార్ట్ మీటర్లు పెట్టే నిర్ణయం తీసుకున్నారు జగన్. ఇది కేంద్ర ప్రభు త్వం చెప్పడంతోనే .. చేశారని హరీష్‌రావు చెప్పారు. అంతేకాదు.. ఇలా చేస్తే.. కేంద్రం నుంచి 4 వేల కోట్ల రూపాయల మేరకు జగన్ ప్రభుత్వానికి అప్పుగా వస్తోందన్నారు. ఇది రాజకీయంగా జగన్‌కు ఇబ్బంది సృష్టించింది. ఇక, కేటీఆర్ కూడా.. ఏపీలో వైసీపీ పాలనా సమయంలో నెలకొన్న సమస్యలను ప్రస్తావించి ..ఇరుకున పడేశారు. ఏపీలో ఎక్కడ చూసినాగుంతల రోడ్లే ఉన్నాయని.. తన స్నేహితులు చెప్పారంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ.. జగన్ బీఆర్ఎస్ నాయకుల తో కలివిడిగానే ఉంటున్నారన్న చర్చ ఉంది. కట్ చేస్తే.. ఇప్పుడు బీఆర్ఎస్ స్థానంలో కవిత తెరమీదికి వచ్చారు. నేరుగా జగన్‌ను ఆమె సమర్థించకపోయినా.. అసందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు.. వైసీపీలో చర్చకు దారితీశాయి. జగన్ రాజధాని విషయంలో చేసిన 'మావిగన్' ప్రకటనను కవిత స్వాగతిస్తున్నట్టుగా మాట్లాడారు. దీనిని అడ్డు పెట్టుకుని కూటమి ప్రభుత్వంపైనా ముఖ్యంగా సీఎం చంద్రబాబుపైన, రాజధాని అమరావతిపైనా విమర్శలు గుప్పించారు. దీంతో వైసీపీ నాయకులు తమ కు బూస్ట్ వచ్చిందని అనుకుంటున్నారు. కానీ, ఇది వాపే తప్ప బలుపు కాదని.. తెలంగాణ నాయకులను విశ్వసించడం సరికాదని చెబుతున్న వారు కూడా ఉన్నారు. ఎప్పుడు ఎలాంటి టర్న్ తీసుకుంటారో తెలియని.. కవిత గారి లాంటి నాయకులను నమ్మితే.. నిండా మునగడం కాయమ ని అంటున్నారు. కాబట్టి.. కవిత ఏదో చెప్పారని.. చంద్రబాబుపై విమర్శలు గుప్పించారని.. పొంగిపోతే.. అది మొత్తానికే ఇబ్బంది అవుతుందని చెబుతున్న నాయకులు కూడా ఉన్నారు.

ఏపీలో సింపతీ పాలిటిక్స్

ఏపీలో సింపతీ పాలిటిక్స్ నడుస్తున్నాయా? అంటే.. అవుననే సమాధానమే వినిపిస్తోంది. వాస్తవానికి రాజకీయాల్లో సింపతీ కావాల్సిందే. కానీ, అది కొన్ని కొన్ని సార్లు ఫలిస్తుంది.. మరికొన్ని సార్లు వికటిస్తుంది. ప్రజలు ఏది తమకు అనుకూలమని భావిస్తే.. అదే జరుగుతుంది. కానీ.. ప్రస్తుతం వైసీపీకి సింపతీ రాకుండా చేయాలన్న వ్యూహంతో కూటమి ప్రభుత్వం.. చంద్రబాబుకు సింపతీ రాకుండా చేయాలన్న లక్ష్యంతో వైసీపీ అడుగులు వేస్తున్నాయి ఈ క్రమంలోనే వైసీపీ నాయకులు.. పార్టీ అధినేత కూడా.. సంక్షేమ కార్యక్రమాలు సహా.. డీఎస్సీ వంటివాటిని తెరమీదికి తెచ్చారు. వాస్తవానికి సంక్షేమ కార్యక్రమాలు బాగానే వర్కవుట్ అవుతున్నాయి. కానీ, లోపాల ను వెతికి మరీ.. వైసీపీ నాయకులు కూటమి సర్కారును టార్గెట్ చేస్తున్నారు. దీనివల్ల తమకు మేలు జరుగుతుందని అనుకుంటున్నారు. కానీ, ప్రజలకు కూడా ఒక ఆలోచనా విధానం అయితే ఉంటుంది.

# వట్టేం పంప్ హౌస్ మూడో లిఫ్ట్ ను సందర్శించిన సీఎం







**నాగర్ కర్నూల్, సమయం ప్రతినిధి:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను రెండు రోజులపాటు పరిశీలించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లాలోని కుమ్మెర గ్రామం వద్ద ఉన్న వట్టెం పంపు హౌస్ మూడో లిఫ్టును సందర్శించారు. ఎస్ జె ఆర్ పిఆర్‌ఎల్‌ఐఎస్ (పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్)లో భాగంగా చేపట్టిన ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

2020- 2023 సంవత్సరం నాటికి రూ 3300 కోట్లు ప్రాజెక్టుకు ఖర్చు చేయగా, 2023వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు రూ. 800 కోట్లను ఖర్చుచేసి ప్రాజెక్ట్ పనులను కొనసాగించడం జరిగిందన్నారు. పెండింగ్ లో ఉన్న మిగతా సివిల్ పనులను రూ.90 కోట్లతో వచ్చే మూడు నెలల్లో పూర్తి చేయనున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఇక్కడ మొత్తం 10 పంపులు ఉండగా 5 పంపులను ఫిట్ చేసి ట్రయల్ రన్ ను విజయవంతంగా నిర్వహించామన్నారు. వర్షాకాలంలో నీళ్లు రాగానే వెంకటాద్రి రిజర్వాయర్ కు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలిస్తామన్నారు. ఈ రిజర్వాయర్ సామర్థ్యం మొత్తం 16.74 టీఎంసీలు కాగా స్టాండర్డ్ ఆపరేషన్ సిస్టం ద్వారా విడతల వారీగా రిజర్వాయర్ ను నింపడం జరుగుతుందన్నారు. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా మొత్తం 12 లక్షల ముప్పై వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. అలాగే మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రజలకు తాగునీటికి, పరిశ్రమలకు కూడా నీళ్లు అందుతాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## కర్వేన రిజర్వాయర్ పనులు వేగవంతం చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి



**మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి:** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా భూత్పూర్ మండలంలోని కర్వేన ప్యాకేజీ-14, 15 రిజర్వాయర్ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. రిజర్వాయర్ నిర్మాణ పనుల్లో ఇంకా ఎంత మేర పెండింగ్ ఉందని నీటి పారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ సీఈ మాట్లాడుతూ సుమారు రూ.500 కోట్ల విలువైన పనులు ఇంకా మిగిలి ఉన్నాయని సీఎంకు వివరించారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు, భూత్పూర్ రిజర్వాయర్‌ల నిల్వ సామర్థ్యాన్ని పెంచే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. ఆగస్టులో మళ్లీ వచ్చి పనుల పురోగతిని సమీక్షిస్తానని సీఎం తెలిపారు. అప్పటి వరకు భూసేకరణ, మిగిలిన నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. భూసేకరణ కోసం ఇరిగేషన్ అధికారి శివకుమార్ ప్రత్యేకంగా పనిచేస్తారని, ఆయనతో సమన్వయం చేసుకుంటూ అదనపు కలెక్టర్ నేతృత్వంలో ఉత్తమ తహసీల్దార్లను నియమించి పెండింగ్ భూసేకరణ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తాకు సూచించారు. ప్రతిరోజూ చేసిన పనులు, చేయాల్సిన పనులపై సమీక్ష నిర్వహించాలని, రోజుకు కనీసం అరగంట సమయం కేటాయించి పనుల పురోగతిని పర్యవేక్షించాలని కలెక్టర్, ఇరిగేషన్ అధికారులను సీఎం ఆదేశించారు. నిధుల కేటాయింపు సహా ఇతర అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తుందని స్పష్టం చేశారు. పర్యటనలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ మరియు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, ఎస్పీ జానకి, ఎమ్మెల్యేలు జి. మధుసూదన్ రెడ్డి, కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ మూవీ 'పెద్ది' గురువారం జనం ముందుకు వచ్చింది. ఈ సినిమాకు లభిస్తున్న ఆదరణ గురించి తెలియచేయడానికి మేకర్స్ శుక్రవారం సంస్థ కార్యాలయంలో 'బాక్సాఫీస్ ఛాంపియన్ పెద్ది' పేరుతో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత వెంకట సతీష్ కిలారు మాట్లాడుతూ, 'ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. 'పెద్ది' చిత్రం అద్భుతంగా దూసుకుపోతోంది. తొలి రోజే రూ. 135 కోట్లకు పైగా వసూలు చేసింది. ప్రేక్షకుల నుంచి, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి వస్తున్న స్పందన చాలా అద్భుతంగా ఉంది. సినిమా చూసిన వారందరూ ఇది చాలా మంచి సినిమా అని అభినందిస్తున్నారు. అందరూ తమ పిల్లలను తీసుకుని థియేటర్లలో సినిమా చూడండి. ఇది రామ్ చరణ్ గారి కెరీర్‌లో బెస్ట్ సినిమా.









OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085